ఎదురుగా అచ్యుతముని, ఆ ప్రక్కన జనమేజయరావు, కొంచెం దూరంలో ఆయా ఎలిజబెత్.

నిశాంత వైపు అపాదమస్తకం చూశాడు అచ్యుతముని.

"అనుకున్న గడువు కంటే ముందే వజ్రాయుధాన్ని తయారు చేసావ్.....ఐఎప్రిషేట్ యూ జనమేజయా......నిశాంత అందమైందే కాదు, తెలివైంది కూడా" నవ్వాడు అచ్యుతముని.

ఎందుకు అచ్యుతముని అలా నవ్వుతున్నాడో అర్థంకాలేదు. నిశాంతకు తనెందుకు దేశ్‌ముఖ్‌ని ఆకర్షించాలో కూడా అర్థంకాలేదు నిశాంతకు.

* * * * * * * *

హోటల్ తాజ్‌మహల్ ఇంట్ కాంటినెంటల్లో తన సూట్లోంచి బయటికొచ్చిన దేశ్‌ముఖ్-

తిన్నగా లిఫ్టువైపు నడిచాడు. మరో మూడు నిమిషాల తర్వాత లిఫ్టు గ్రౌండ్ ఫ్లోర్లోకొచ్చింది.

అప్పుడు సమయం-

సరిగ్గా రాత్రి పది గంటలు.........

ఆయన్ని చూసిన సెక్యూరిటీ స్టాఫ్, నాలుగువైపుల నుంచి పరిగెత్తుకొచ్చారు.

అదే సమయంలో పి.ఎ. సుభాష్‌చంద్ర మెట్లమీద నుంచి కిందకు దిగుతున్నాడు.

"మిస్టర్ సుభాష్! అర్జంటు పనిమీద బైటకెళ్తున్నాను. కారు వద్దు సెక్యూరిటీ స్టాఫ్ వద్దు.......ఆటోని కేకేయ్"

ఆయన ఏమంటున్నాడో వెంటనే అర్థంకాలేదు సుభాష్‌చంద్రకి.

అర్థంకాగానే షాక్ తిన్నాడు. ఆ షాక్ నుంచి వెంటనే తేరుకుని-

"టాక్సీని పిలుస్తాను సర్!" అన్నాడు ఒకింత భయంగా.

కాదనలేదు దేశ్‌ముఖ్. మరో నిమిషానికే టాక్సీ ఎక్కాడు ఆయన టాక్సీ ముందుకు దూసుకుపోయింది.

సుభాష్ చంద్రతో పాటు, సెక్యూరిటీ స్టాఫ్ నిశ్చేష్టులై నిలబడి పోయారు.

* * * * * * * * *

జుహు బీచ్ ఏరియాలోని శివసాగర్ రోడ్డు........

ఆ రోడ్లో వున్న బిల్డింగుల్లో ఓ బిల్డింగ్‌లోంచి తనకు ఫోను వచ్చింది.

ఆపరేటర్ చెప్పిన మాటాలు మరోసారి గుర్తుకు తెచ్చుకున్నాడు కృపానంద దేశ్‌ముఖ్.

నిశాంత తననెందుకు ఎట్రాక్ట్ చేసింది? నిశాంత కోసం తను ఎందుకు వెళ్తున్నాడు?

కొన్ని గంటలనుంచి ఆయన్ని వేధిస్తున్న ప్రశ్నలివి.

ప్రతి సక్సెస్‌ఫుల్ బిజినెస్‌మెన్‌కి తనొక గుడ్ టాలెంట్ స్పాటర్‌ననే నమ్మకం సహజంగా వుంటుంది. అలాంటి నమ్మకమే దేశ్‌ముఖ్‌కూడా వుంది.

నిశాంత జ్ఞాపకం వచ్చినప్పుడల్లా క్లియోపాత్రా గుర్తుకొస్తోందతనికి.

అందం గొప్పదా? తెలివితేటలు గొప్పవా?

ఆకర్షణ గొప్పదా చొరవ గొప్పదా?

ఇంతకీ నిశాంత ఎవరు? అది తెల్సుకోడానికే వెళుతున్నాడు దేశముఖ్.

ఆ ప్రశ్నకు జవాబు తెలిస్తే......కథ వేరే మలుపు తిరిగేదేమో........?

*     *     *     *     *     *     *     *     *     *     *

శివసాగర్      రోడ్డు నిర్మానుష్యంగా వుంది.

టాక్సీ దిగి రోడ్డు ప్రక్కనున్న బిల్డింగుల వైపు చూస్తూ నడుస్తూన్నాడు ఆయన.

రోడ్డుకి ఎడం ప్రక్కన రెండు బిల్డింగులు వంటరిగా వున్నాయి........

"ఫోన్ నెంబర్ ...........సుందర్‌లాల్....అన్న వ్యక్తి పేరు మీరు వుంది సార్" ఆపరేటర్ చెప్పిన మాటలు మరోసారి గుర్తుకు చేసుకున్నాడు ఆయన.

ఆ రెండు బిల్డింగుల్లో మొదటి బిల్డింగ్ వైపు నడిచాడు.

"సుందర్‌లాల్ బిల్డింగ్ యిదేనా?" దేశ్‌ముఖ్ వైపు ఎగాదిగా చూశాడు ఆ గేటు దగ్గరున్న గూర్ఖా రెండో బిల్డింగ్ సార్" చెప్పాడు. గూర్ఖా.

రెండో బిల్డింగు వైపు అడుగులు వేశాడు ఆయన.

ఆయన గేటు దగ్గరకు వెళ్ళగానే వినయంగా గూర్ఖా గేటు తెరిచాడు సలాం చేశాడు.

సిమెంట్ బాటమీంచి నడిచి హాల్లోకి అడుగుపెట్టిన దేశ్‌ముఖ్ నాలుగువైపులా చూశాడు.

ఎక్కడా మనిషి వున్న శబ్దం లేదు.

"బేబీ!" పిలిచాడు ఆయన ఆ పిలుపుకి జవాబులేదు.

హాలు మధ్యలో వున్న మెట్లమీంచి ఫస్టు ఫ్లోర్లోకి అడుగు వేశాడు.

ఎదురుగా ఓ గది!

ఆ గది తలుపులు దగ్గరగా వేసున్నాయి. నెమ్మదిగా ఆ తలుపుల్నిలోనికి తోశాడు.

"వెల్‌కమ్........దేశ్‌ముఖ్......సాబ్......వెల్‌కమ్....." హాలు మధ్యన ఉయ్యాల్లో కూర్చున్న అచ్యుతమునిని చూసి ఉలిక్కిపడ్డాడు దేశ్‌ముఖ్.

"మీరు ఎవరికోసం వచ్చారో నాకు తెలుసు. మీరు ఆ వ్యక్తిని కలవాలనుకుంటున్నారు కదూ?"

జవాబు చెప్పలేదు ఆయన అలాగే నిలబడ్డాడు.

దేశ్‌ముఖ్ చెయ్యి పట్టుకుని ముందుకు తీసికెళ్ళి సోఫా మీద కూర్చోపెట్టాడు గౌరవంగా.

అచ్యుతముని ముఖంలోకి సూటిగా చూశాడు దేశ్‌ముఖ్.

నిశాంత అచ్యుత్‌ముని కేమవుతుంది? ఆలోచిస్తున్నాడు ఆయన.

“నేను నిశాంతని కలవడానికొచ్చాను” పొడిగా అన్నాడు ఆయన.

అచ్యుతముని ఇంటర్నేషనల్ బ్రోకర్. పొలిటీషయన్లకు, బిజినెస్‌మెన్‌కు మధ్య వారధి అందుకే అచ్యుతమునిని ఎప్పుడూ ఎంటర్ టైన్ చెయ్యలేదు దేశ్‌ముఖ్- సాక్షాత్తు ప్రైమ్ మినిష్టర్ రెసిడెన్స్ నుంచే ఫోను చేసేవాడు అచ్యుతముని.

“మీరూ వ్యాపార వేత్తే, నేనూ వ్యాపార వేత్తే మీరు కోరుకునేది మనీ పొలిటిక్స్.....నేను కోరుకునేది పవర్ పొలిటిక్స్. సో..............మిస్టర్ దేశ్‌ముఖ్! నేను మీ సహాయం కోరి, మీ దగ్గరకు రావాలనుకున్నాను..........అనుకోకుండా మీరే వచ్చారు.”

“నీకు! నా సహాయం కావాలా?” నమ్మలేనట్లుగా చూశాడు దేశ్‌ముఖ్ అచ్యుతముని వైపు

“అవును! మీకేం కావాలన్నా యిస్తాను. అది డబ్బు రూపంలో కావచ్చు, అధికారం రూపంలో కావచ్చు” గర్వంగా చెప్పాడు అచ్చుతముని

“నీకేం సహాయం కావాలి?” అడిగాడు దేశ్‌ముఖ్.

“మీ బిజినెస్ గ్రుప్‌లో మా వాడిని పార్ట్‌నర్‌గా చేరుకోవాలి”

వెంటనే చెప్పాడు అచ్యుతముని.

“ఎవరా వ్య క్తి?”

“దర్మ శేఖరనాయుడు! ఎక్స్.ఎం.పి అతను మీకు బాగా వుపయోగపడతాడు.”

“అతను నా కంటే! ముందు నీకు బాగా వుపయోగపడతాడనుకుంటాను” నర్మ గర్భంగా అన్నాడు దేశ్ ముఖ్

“అవును! నాకు వుపయోగంలేనిదే నేనే పనీ చెయ్యను ధర్మ శేఖర నాయుడ్ని మీ గ్రూప్‌లో కలుపుతానని మాటిచ్చాను. ఆ సహాయం నాకు చెయ్యండి. మీకే సహాయం కావాలన్నా, ఎప్పుడు కావాలన్నా నేను రెదీగా వున్నాను”

లేచి నిలబడ్డాడు దేశ్‌ముఖ్.

“ఓ కె. మిస్టర్ అచ్యుతముని! ధర్మ శేఖరనాయుడ్ని నాదగ్గరకు పంపించు.”

ఆయన తన ప్రపోజల్‌కు వెంటనే ఒప్పుకుంటాడని వూహించని అచ్యుతముని గర్వంగా తనలో తను నవ్వుకుని. లేచి నిలబడ్డాడు.

“అచ్యుతముని! నేను కూడా నాకు వుపయోగంలేని పనిని నేనెప్పుడూ చెయ్యనని నీకు తెలుసు. నా ద్వారా ధర్మ శేఖరనాయుడు ఎలా లాభపడాలనుకుంటున్నాడో, ఆ నాయుడు ద్వారా నువ్వెలా లాభపడాలనుకుంటున్నావో! అన్నీ నాకు తెలుసు. కానీ నువ్వు నాకొక సహాయం చెయ్యాలి.”

ఐయామ్ రెడి టు డు ఇమ్మీడియట్లీ.........” అన్నాడు అచ్యుతముని ఆ సహాయము ఎలాంటిదో వూహిస్తూ.

“నాకు డబ్బు అఖ్ఖర్లేదు. పొలిటికల్ పవర్ అఖ్ఖర్లేదు. నాకు కావల్సిందిఒక వ్య క్తి ఆ వ్య క్తి నిశాంత” దేశ్‌ముఖ్ నోటి నుంచి వచ్చిన ఆ మాటకు లోలోనే నవ్వుకున్నాడు అచ్యుతముని.

“ఆ అమ్మాయితో మీకేం పని?” అడిగాడు అచ్యుతముని తెలిసినా తెలియనట్లుగా.

“నాకు వ్యక్తులతో పనిలేదు. వ్యక్తుల్లోని శక్తులతో పని” ముందుకు నడుస్తూ అన్నాడాయన.

“మీరు హోటల్‌కి వెళ్ళేసరికి మీకెదురుగా వస్తుంది. మీ నిశాంత” అన్నాడు అచ్యుతముని తన పథకం పారబోతున్నందుకు ఆనందిస్తూ.

బయటికెళ్ళిపోయిన దేశ్‌ముఖ్ గురించి ఆలోచిస్తూ ఉయ్యాల్లో వూగుతున్న ఆచ్యుతముని వైపు-

అప్పుడే పక్కగదిలోంచి వచ్చిన జనమేజయరావు ఆశ్చర్యంగా చూశాడు.

అచ్యుతముని,దేశ్‌ముఖ్ మధ్య జరిగిన సంభాషణంతా విన్న జనమేజయరావుకి ఏం అర్థంకాలేదు.

అదే అడిగాడు జనమేజయరావు.

ఆ ప్రశ్నకు చిద్విలాసాంగా నవ్వాడు అచ్యుతముని.

“పదునైన ఆయుధానికి పది అంచులుంటాయి. అలాగే తెలివితేటలకు కూడా. ఆయన నిశాంతను ఎందుకు కోరుకున్నాడో నాకు తెలుసు ...........నిశాంతను ఎందుకు వుపయోగిస్తాడో నాకు తెలుసు. నాకు కావల్సింది అదే అందుకే.........”

“అంటే”

“ఇదొక డెడ్‌లీ డేంజరస్ గేమ్ నీకు చెప్పినా అర్థంకాదు. నిశాంతను దేశ్‌ముఖ్ దగ్గరకు పంపించు.....ఇకనుంచీ ఆ అమ్మాయికీ, మనకూ ఏ విధమైన సంబంధం లేదు” ఉయ్యాలలోంచి లేచాడు అచ్యుతముని.

జనమేజయరావు మౌనంగా ఫోన్ వైపు నడిచాడు.

* * * * * * * * * *

టాక్సీలోంచి దిగిన దేశ్‌ముఖ్‌ని చూసి వూపిరి పీల్చుకున్నారు సెక్యూరిటీ స్టాఫ్.

పి.ఎ. సుభాష్‌చంద్ర పరిస్థితి నిప్పు కణికల మీద నుంచున్నట్లుగా వుంది.

తన ప్రాణాల్ని లెక్కచేయకుండా ఆయన ఎందుకలా ఒంటరిగా తిరుగుతున్నాడు?

స్పెయిన్ నుంచి వచ్చిన దగ్గర్నించి ఆయనలో వచ్చిన మార్పుని స్పష్టంగా గమనిస్తున్నాడు సుభాష్‌చంద్ర.

మరీ ముఖ్యంగా నిశాంత కలిసిందగ్గరినుంచి

"ఎవ్వెరిథింగ్ ఓ.కె." విష్ చేస్తూ ముందుకు అడుగేశాడాయన.

"ఓ.కె సార్........నైట్ రెండు గంటలకు టోక్యో టూర్"
జ్ఞాపకం చేశాడు సుభాష్‌చంద్ర

ఆ విషయం పట్టించుకోలేదు ఆయన.

"ఈజ్ దేర్ ఎనీబడీ ఫర్‌మీ........"

"యూ మీన్ గెస్ట్స్ సర్.......నో సర్" సుభాష్‌చంద్ర అన్నాడు వినయంగా.

ముందుకు అడుగేస్తున్న ఆయన రిసెప్షన్ కెదురుగా లాంజ్‌లో సోఫాలో కూర్చున్న వ్యక్తి వైపు చూశాడు.

నిశాంత.......!

నల్లటి లంగా, వోణిలో నిశాంత ఆడనాగులా కూర్చుని వుంది.

ఠీవిగా లేచి, హుందాగా నడుస్తూ ఆయనకి ఎదురుగా వచ్చింది నిశాంత.

"హౌ ఆర్యూ......జెంటిల్‌మేన్" నిశాంత కాటుక దిద్దిన కళ్ళ వైపు చూశాడాయన

"నా సామ్రాజ్యంలోకి ప్రవేశిస్తున్న నీకు స్వాగతం పలుకుతున్నాను."

ఆయన కళ్ళల్లోకి సాలోచనగా చూసింది నిశాంత.

అంత త్వరగా అచ్యుతముని నిశాంతను తన దగ్గరకు పంపించటాన్ని నమ్మలేకపోయాడు ఆయన.

* * * * * * * * *

ముస్సోరి .........ది క్వీన్ ఆఫ్ ది హిమాలయాస్ పల్చగా కురుస్తున్న మంచు.....ఆ మంచును చీల్చుకుంటూ పట్టణాన్ని ఆక్రమించుకుంటున్న సన్నటి సూర్య రశ్మి........

న్యూఢిల్లీ 290 కిలోమీటర్ల

దూరంలో వున్న అందాల పట్టణం ముస్సోరి మంచులో తడుస్తున్న ఎటు చుస్తే అటు కాషాయాంబర ధారులైన భౌద్ధ భిక్షా వులు.

హేపీ వేలీ టిబెటన్లు టౌన్ షిప్. ఆ పట్టణానికి అలంకారం టిబెటన్ల ప్రార్థనా స్థూపం ఎటు చూస్తే అటు కాషాయాంబర ధారులైన బౌద్ధ భిక్షా వులు.

ఆ హేపీ వెనుక గన్‌హిల్. బ్రిటీష్ కాలంలో రోజూ మధ్యాహ్నము సరిగ్గా పన్నెండు గంటల సమయంలో తుపాకీ పేలేది. పట్టణ వాసుల మధ్యాణ్నం కార్యక్రమాలు అప్పట్నించీ ప్రారంభమయ్యేవి.

ఆ సమీపంలో వున్న కొండలే ఝూలాఘర్ కొండలు గన్‌హిల్‌కు ఝూలాఘర్‌కు మధ్య 400 మీటర్ల రోప్‌వే ప్రత్యేక ఆకర్షణ. ఆ రోప్‌వేలో తిరిగే ట్రాలీ బస్సులో విహరించటం యాత్రికులకు

అద్భుత అనుభవం.

కొంచెం దూరంలో ఒక మెలు పొడవున విస్తరించిన ఇండియన్ బజార్ అచ్ఛమైన భారతీయ సౌందర్యానికి ప్రతీక. ఆ బజార్లో అరరాత్రి తర్వాత జరిగే భారతీయ నృత్య ప్రదర్శనల్ని చూడడానికి విదేశియులు వుబలాట పడతారు.

నగరం నాలుగు వైపులా వున్న మోసీ ఫాల్స్, భట్టాఫాల్స్, హార్డీ ఫాల్స్, కెప్టు ఫాల్స్ మధ్య నగరం నిత్యమూ అభిషేకం పొందుతున్న శివలింగములా వుంటుంది.

ఆ హేపీ వ్యాలీకి రెండు కిలోమీటర్ల దూరంలో పదెకరా విశాలమైన ప్రదేశంలో రక్త చందనంతో తయారు చేసినట్టుగా వుందోక బిల్డింగ్. ఆ బిల్డింగ్‌కి రెండు వందల సంవత్సరాల చరిత్ర వుంది. ముస్సోరీలో మిలటరీ స్టేషన్‌ని నిర్మించడానికి వచ్చిన బ్రిటీష్ ఆఫీసర్ కెప్టెన్ యంగ్ తన నివాసం కోసం నిర్మించుకున్న బిల్డింగ్ ఆ యంగ్ ప్యాలెస్. ఆ ప్రాంతమంతా ప్రస్తుతం ప్రొటెక్టెడ్ ఏరియా, ప్రైవేట్ ప్రోవర్టీ ఆ బిల్డింగ్‌కి రెండు కిలోమీటర్ల దూరంలో స్పెషల్ చెక్‌పోస్టు స్పెషల్ ఆర్మ్‌డ్ సెక్యూరిటీ ఫోర్స్ నిఘా.

యంగ్ ప్యాలెస్ దూరం నుంచి చూస్తే జైలులా వుంటుంది. చుట్టూ ఎత్తయిన గోడలు ఐరన్ ఫెన్సింగ్. ఆ ఫెన్సింగ్‌లో నిరంతరం ప్రవేశించే విద్యుత్ ప్రవాహం.

మైన్ గేట్‌కి పక్కన సెక్యూరిటీ ఆఫీస్. ఆ పక్కన స్పెషల్ కంట్రోల్ రూమ్ . ఆ పదెకరాల భవనంలో ఎక్కడ ఏం జరిగినా వెంటనే అలారమ్ చేసే కంప్యూటర్ ఎక్విప్‌మెంట్ సీటిలైట్ ద్వారా పనిచేసే కమ్యూనికేషన్ సిస్టమ్స్.

ఆ సెక్యూరిటీ చీఫ్ ప్రభాకరదేవ్. ఎక్స్ మిలటరీ ఆఫీసర్.

సెక్యూరిటి చీఫ్ దాటాక అందమైనగార్డెన్. గార్డెన్ మధ్యలో సిమెంట్ బాట. అక్కడక్కడ నీటి కొలనులు. నీళ్ళను విరజిమ్మే ఫాంటెన్స్. అక్కడక్కడ అందంగా అమర్చిన పాలరాతి శిల్పాలు. గ్రీన్ యుద్ధవీరులు శిల్పాలవి.

ఆ శిల్పాలు దాటి లోనికెళితే........

మెయిన్ బిల్డింగ్ విశాలమైన వరండా. ఆ వరండా చివర విశాలమైన రూమ్. అది ఆ బిల్డింగ్ మేనేజర్ అనంతమూర్తిది అనంతమూర్తికి అరవై ఏళ్ళుంటాయి.

ఆ బిల్డింగ్‌లో పనిచేసే సిబ్బందికి అనంతమూర్తి చీఫ్.

ప్రస్తుతం అనంతమూర్తి తన చేతిలో వున్న ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పేపర్‌ని పక్కన పడేసి గబగబా ఆ గదిలోంచి లోనికి నడిచాడు.